## క్లుప్తంగా

### బండలాగుడు పోటీలు ప్రారంభం



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

గోనెగండ్ల: గంజిహళ్లి గ్రామంలో మహాత్మ బడే సాహెబ్ తాత ఉరుసు సందర్భంగా గ్రామ పెద్దలు బండలాగుడు పోటీలు నిర్వహించారు. మంగళవారం నెల పూజ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు తిరుమల రెడ్డి, సర్పంచ్ కామర్తి లింగమ్మ, రాముడు, మహేష్ రెడ్డి న్యూ కేటగిరీ విభాగంలో ఎద్దుల బండలాగుడు పోటీలను పూజ చేసి ప్రారంభించారు. పోటీలకు జిల్లా నుంచి 9 జతల ఎద్దులు పాల్గొన్నాయి. విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు ఐదో బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### చెరువు తూము పరిశీలన



విచారణ చేస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి

పత్తికొండ రూరల్: స్థానిక షాదీఖానా సమీపంలో చెరువు తూమును మంగళవారం ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి పరిశీలించారు. గత కొన్నిరోజుల నుంచి చెరువు కడగొమ్ము, తూము పూడ్చివేతకు గురైందని రైతులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి మట్టితో పూడ్చిన ప్రదేశాన్ని సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఎస్ఈ ఆదేశాల మేరకు మట్టిని తొలగించాలని ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

### రికవరీకి సహకరించండి

తుగ్గలి: పక్కా ఇళ్ల నిర్మాణాలలో దుర్వినియోగమైన సొమ్మును తిరిగి చెల్లించి అధికారులకు సహకరించాలని పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి కోరారు. రాంపల్లిలో ఎనిమిదేళ్ల క్రితం జరిగిన 156 పక్కా ఇళ్ల నిర్మాణాల్లో రూ.63.63 లక్షలు దుర్వినియోగమైనట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. ఈ సొమ్మును రికవరీ చేయాలని జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో సీఐ మంగళవారం తుగ్గలి పోలీసుస్టేషన్‌కు పిలిపించి బాధ్యులతో మాట్లాడారు. వచ్చే నెల 4వ తేదీలోపు సొమ్ము చెల్లించాలని లేనిపక్షంలో రెవెన్యూ అధికారులు ఆస్తులు జప్తు చేస్తారన్నారు.

### ఘనంగా ఊరేగింపు



కలశాలతో ఊరేగింపు చేస్తున్న చిన్నారులు

మద్దికెర: పెరవలి బీసీ కాలనీ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి పండుగ నిర్వహించేందుకు సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వారి విగ్రహాలను దాతలు పారా ప్రసాద్, పారా విశ్వనాథ్ మంగళవారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధులగుండా ఊరేగించారు. దాతలు మాట్లాడుతూ దేవాలయంలో రూ. 3 లక్షలతో కళ్యాణ మండపం నిర్మించామని, పేదలు ఉచితంగా వివాహ కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

### వేలంలో తగ్గిన ఆదాయం

ఆలూరు: దేవనకొండ గ్రామ పంచాయతీ పరిధిలో వివిధ వ్యాపారాలకు నిర్వహించిన వేలంలో గతేడాది కంటే ఆదాయం రూ.2 లక్షలు తగ్గింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రంగలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం వేలంపాట నిర్వహించారు. బండ్లమెట్టను పొట్లన్న గారి వెంకటరాముడు రూ.2.75 లక్షలకు, వారపు సంతను రూ.1.58 లక్షలకు చాకలి హనుమంతు, కబేళాను రత్నాజీ రావు రూ.28,500లకు దక్కించుకున్నారు. ఈఓపీఆర్డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 1న బండలాగుడు పోటీలు

చిప్పగిరి: నేమకల్లులో శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 1న రాష్ట్రస్థాయి వృషభాల రాతి దూళం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ ప్రేమ్‌కుమార్, గ్రామ పెద్దలు తెలిపారు. వారు మంగళవారం మాట్లాడుతూ.. ఈ నెల 31న రథోత్సవం, ఏప్రిల్ 1న రాతి దూళం లాగే పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు చొప్పున దాతల సహకారంతో అందించనున్నట్లు వెల్లడించారు.

### సేవాగుణం అలవర్చుకోవాలి



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న శ్రీధర్‌రావు

నందవరం: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని కర్నూలు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి సూచించారు. శ్రీశైల పాదయాత్ర భక్తులకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు, అన్నదానం చేసినందుకు మంగళవారం జిల్లా కలెక్టర్ కోటేశ్వరావు చేతుల మీదుగా నందవరం మండలవాసులు శ్రీధర్‌రావు, మహమ్మద్, చాకలి చంద్రన్న ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణపై ప్రోత్సాహం
- సంఘాల పనితీరును సర్వే చేస్తున్న వెలుగు అధికారులు



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీసీలు

ఆలూరు: పొదుపు మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలుచేస్తోంది. వారు వివిధ వ్యాపారాలలో రాణించేందుకు ఆర్థిక సాయం అందించడంతో పాటూ బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేసి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్థిర ఆదాయం పొందేలా ప్రోత్సహిస్తోంది. తమ నైపుణ్యం, అభిరుచులకు అనుగుణంగా వ్యాపారాలను ఏర్పాటు చేసుకునేందుకు సహకారం అందిస్తూనే సాధారణ గృహిణులకు సైతం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై అవగాహన కల్పించి శిక్షణ అందిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన మహిళలు సొంతంగా గ్రామాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేయాలని అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. నియోజకవర్గంలోని మండల, గ్రామ స్థాయిలో సీనియారిటీ ఉన్న పొదుపు సంఘాల సభ్యులకు, బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలకు వాయిదాలు సకాలంలో చెల్లిస్తున్న సంఘాలకు రుణాల మంజూరులో ప్రాధాన్యత లభిస్తోంది. వోకల్ ఫర్ లోకల్ అనే నినాదంతో కేంద్ర, రాష్ట్ర ఆహార శుద్ధీకరణ, పరిశ్రమల్లో పొదుపు సంఘాల మహిళలను ప్రోత్సహిస్తోంది.

**రూ.కోటి వరకు రుణాలు**

ప్రధానంగా సీనియర్ పొదుపు గ్రూపు సభ్యులు శనగలను నూర్పిడి చేసి పప్పులను తయారు చేయడం ,వేరుశనగ నుంచి గానుగ నూనె తీయడం, అప్పడాలు, చిక్కీలు, వడియాలు, బెల్లపుగానుగ, పాలకోవా, ఊరగాయలు, చేపల పెంపకం తదితర వాటి నిర్వహణ కోసం దాదాపు రూ.కోటి వరకు రుణాలను మంజూరు చేయనున్నారు. ఆయా వ్యాపారాలను బట్టి లబ్ధిదారుడి వాటా 10 శాతం, 35 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకు రుణంగా మంజూరు చేస్తారు. ఆలూరు మండలంలో 1,089 పొదుపు గ్రూపులు, హాలహర్విలో 836 ఆస్పరిలో 1,241, చిప్పగిరిలో 667, దేవనకొండలో 1,533, హొళగుందలో 846 పొదుపు గ్రూపులు ఉన్నాయి. ఆయా గ్రూపులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించడంపై హర్షం వ్యక్తమవుతోంది.

**మహిళలకు మంచి అవకాశం**



మహిళలను ఆర్థికంగా చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రస్తుతం వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్, సీసీ, ఎంబీకేలు తదితరులు ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలో పనిచేస్తున్న వారిని సమగ్రంగా సర్వే చేసి గుర్తించాలి. బ్యాంకుల ద్వారా రుణాలు పొందే విధానంపై పొదుపు గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించాలి. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రుణాలు ఎంతగానో ఉపయోగపడతాయి. – రమాదేవి, ప్రగతి పొదుపు గ్రూపు లీడర్, పెద్దహోతూరు గ్రామం

**ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై సమగ్ర సర్వే**



పొదుపు గ్రూపులలోని సభ్యులు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నడుపుతూ జీవనం కొనసాగిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తాం. బ్యాంకు అధికారులు కూడా యూనిట్లను తనిఖీ చేస్తారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై సమగ్ర సర్వే కొనసాగుతోంది. అర్హులైన గ్రూపుల సభ్యులకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తాం. – నవీన్, ఐకేపీ ఏపీ, ఆలూరు

### పంచాయతీకి పెరిగిన ఆదాయం

గోనెగండ్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీకి వేలం పాట ద్వారా గతేడాది కంటే రూ.3,64,000 ఆదాయం పెరిగినట్లు పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీఓ నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు, సర్పంచ్ హైమవతి ఆధ్వర్యంలో కమేళా, సంతమార్కెట్, బండిమెట్టకు వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటలో కమేళా, సంతమార్కెట్ హక్కులను కడపల గోపాల్ రూ.77 వేలు, రూ.1,01,700లకు, బండిమెట్టను బడేసా రూ.1,07,000లకు, వేలం పాడి దక్కించుకున్నారు. పంచాయతీ సిబ్బంది సతీష్, మలాంగ్, సుభాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మార్కెట్ వేలాలు మళ్లీ వాయిదా

ఆలూరు రూరల్: గ్రామ పంచాయతీ పరిధిలోని రోజువారి మార్కెట్, వారపు సంత, పశువుల సంత వేలాలు రెండోసారి వాయిదా వేసినట్లు ఆలూరు మండల ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీలో వేలాలను సర్పంచ్ అరుణాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్, గొర్రెల, పశువుల మాంసం, వధశాలలకు వేలాలు నిర్వహించగా కేవలం నలుగురు మాత్రమే హాజరై డిపాజిట్ చెల్లించడంతో వేలాలను ఏప్రిల్ 1వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు, ఈఓ కృష్ణ కుమార్ వెల్లడించారు. ఆసక్తిగల వారు రూ.2 లక్షలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

## మహిళల అభ్యున్నతే ధ్యేయంగా పథకాలు



పొదుపు మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆమె మంగళవారం కృష్ణగిరిలో వైఎస్సార్ ఆసరా మూడో విడత మెగా చెక్కును ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణితో కలిసి పొదుపు మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగనన్న మహిళలకు అండగా నిలుస్తున్నాడని కొనియాడారు. కృష్ణగిరి మండలంలో 414 సంఘాల్లోని 4,761 మంది మహిళల ఖాతాల్లో వరుసగా మూడో ఏడాది రూ.1,87,86,206 నగదు జమ చేసినట్లు తెలిపారు. అనంతరం సీఎం జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. మహిళలు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. తహసీల్దార్ పురుషోత్తం, వైస్ ఎంపీపీలు సుశీల, రాజేష్, నాయకులు బ్రహ్మానందరెడ్డి, మాధవరావు, సర్పంచ్‌లు సర్వేశ్వరి, గిరిబాబు, వాణిశ్రీ, అంజినమ్మ, మహాదేవమ్మ, ఎంపీటీసీ మహాలక్ష్మి, ఏపీఎం దాసన్న, మండల మహిళాసమాఖ్య అధ్యక్షురాలు సరోజమ్మ, వెలుగుసీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఉరుసులో పాల్గొన్న ఎమ్మెల్యే**

గోనెగండ్ల: గంజిహళ్లిలో వెలసిన మహాత్మ బడేసాహెబ్ స్వామి నెల ఉరుసు మంగళవారం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి వారికి ఫాతేహాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్గా కమిటీ సిబ్బంది క్యూలైన్లను ఏర్పాటు చేశారు. మంగళవారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్గాను దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. సర్పంచ్ రాముడు, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 20 జీవాలు సజీవదహనం

గోనెగండ్ల: కున్నూరులో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 20 పొట్టేళ్లు సజీవ దహనమయ్యాయి. గ్రామానికి చెందిన చాకలి లింగన్న తన పొలంలో రేకులషెడ్డు నిర్మించుకుని 20 పొట్టేళ్లను పెంచుతున్నాడు. మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి షెడ్డు మొత్తం కాలి బూడిదైంది. షెడ్డులోని పొట్టేళ్లు సజీవదహనం కాగా పొలంలో వేసేందుకు ఉంచిన 10 బస్తాల వేరుశనగ విత్తనాలు కాలి బూడిదయ్యాయి. రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

### ఇద్దరికి తీవ్రగాయాలు

వెల్దుర్తి: హైవే-44పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. వెల్దుర్తి వైపు హైవే ఎంట్రన్స్ దాబా వద్ద నుంచి ఐరన్ మెటీరియల్ లోడ్‌తో లారీ రోడ్డుపైకి వచ్చింది. ఆ సమయంలో కర్నూలు నుంచి వెల్దుర్తి వైపు కోళ్ల లోడ్‌తో వస్తున్న జీపు వెనుకనుంచి ఢీకొట్టింది. జీపు డ్రైవర్ గాయపడ్డాడు. మరో ఘటనలో అల్లుగుండు క్రాస్ వద్ద నుంచి పెట్రోల్‌బంక్ వద్దకు వెళ్తున్న ఆటోను డోన్ వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ బొమ్మిరెడ్డిపల్లె నాయుడు గాయపడగా కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

## నేటి నుంచి ఆంజనేయస్వామి ఉత్సవాలు

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో బుధవారం నుంచి ఆంజనేయస్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ లింగమ్మ మంగళవారం తెలిపారు. ఆలయంలో బుధ, గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, శుక్రవారం స్వామి వారి రథోత్సవం, శనివారం పూజలు, ఆదివారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తున్నట్లు చెప్పారు.

**1న రాష్ట్రస్థాయి భజన పోటీలు**

ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీన రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.20 వేలు మొదలుకుని 18 స్థానాల వరకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. అలాగే ఉత్తమ గాయకుడు, హార్మోనిస్టు, తబలిస్టుకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు అదే రోజు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, వివరాలకు సెల్ 90145 53955, 76809 78114 నంబర్లను సంప్రదించాలన్నారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇంటికి అతికించే బోర్డును చూయిస్తున్న డీఈ ఎస్వీ ప్రసాద్

ఎమ్మిగనూరురూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటనారాయణ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఇళ్ల నిర్మాణాలపై ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, ఆదోని, మంత్రాలయం మండలాలకు చెందిన మేస్త్రీలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.2.15 లక్షలు ఇస్తుందని, ఈ డబ్బు లబ్ధిదారుడు, ఇంటి నిర్మాణం చేసే మేస్త్రీల పేరిట జాయింట్ అకౌంట్‌లో జమ చేస్తామని చెప్పారు. మేస్త్రీలు రూ.2.15 లక్షలతో చక్కని ఇంటిని ఎలా పూర్తి చేయాలో వివరించారు. ఆదోని డివిజన్‌లో ఇంటి నిర్మాణాల కోసం రూ.138.86 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. హౌసింగ్ డీఈలు ఎస్వీ ప్రసాద్, రవికుమార్, లాలకృష్ణ, ఏఈలు రామ్‌నాథ్, వేణుగోపాల్,లక్ష్మన్న, గురుస్వామి,మేస్త్రీలు పాల్గొన్నారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి

వెల్దుర్తి: ఒత్తిడికి లోనుకాకుండా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్ విద్యార్థులకు సూచించారు. ఆయన మంగళవారం రామళ్లకోట, చెరుకులపాడు హైస్కూలు జెడ్పీ హైస్కూళ్లను సందర్శించి పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమౌతున్న విధానాన్ని తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఇన్‌ఛార్జ్ ఈఈ/డీఈ కర్రెన్నను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ఎంపీపీ (మెయిన్) స్కూల్‌ను సందర్శించి టీఏఆర్ఎల్ (టర్ల్) ద్వారా 90 రోజులపాటు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధనా పద్ధతులను తెలుసుకున్నారు. హెచ్ఎంలు శరభయ్య, కిష్టన్న, పీఎంసీ చైర్మన్ షేక్షావలి, సీఆర్‌పీ ప్రసన్న కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

### కరాటేలో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న గుంతకల్ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

మద్దికెర: ఐదవ ఇంటర్ స్కూల్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో మద్దికెర విద్యాసాయి విద్యార్థులు యువరాజ్, రాజు ప్రథమ స్థానం, ఉదయ్‌కుమార్ ద్వితీయ స్థానం సాధించినట్లు కరెస్పాండెంట్ వెంకట మాధవ్ తెలిపారు. మంగళవారం గుంతకల్ పట్టణంలో జరిగిన కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అభినందించి షీల్డులు అందజేశారన్నారు.

## 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు

- వైఎస్సార్ ఆసరా ఉత్సవాల్లో మంత్రి గుమ్మనూరు జయరాం



ఆస్పరిలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం



సభకు హాజరైన మహిళలు

ఆస్పరి: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం ఆస్పరిలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కట్టెల భాగ్యలక్ష్మి అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు నిర్వహించారు. 386 స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆసరా మూడు విడత కింద రూ.1.58కోట్లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన మెగా చెక్కును మంత్రి లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పొదుపు రుణాలు మాఫీ చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతి సంక్షేమ పథకంలో వారికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. నాలుగేళ్ల జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు.మరింత మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌పీకి పట్టం కట్టాలని కోరారు. ప్రతి పక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు చెప్పే మాటలు నమ్మవద్దన్నారు. టీడీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. మండలంలోని జొహరాపురం గ్రామం దగ్గర ఎస్ఎస్ ట్యాంకు నిర్మించి మండల ప్రజల దాహార్తి తీరుస్తామన్నారు. అంతకు ముందు సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీపీ సుంకర ఉమాదేవి, జెడ్పీటీసీ దొరబాబు, సర్పంచ్ మూలింటి రాధమ్మ, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, సీఈఓ ఆశోక్, ఏపీడీ శ్రీధర్, ఏపీఎం రాఘవేంద్ర, ఆస్పరి ఉప సర్పంచ్ వెంకటేశ్వరమ్మ తదితరలు పాల్గొన్నారు.

## అక్కచెల్లెమ్మలకు అండగా జగనన్న



వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి.



కార్యక్రమానికి హాజరైన మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఉప్పర ఫంక్షన్ హాల్‌లో మండలంలోని 7882 మంది స్వయం సహాయక పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత కింద మంజూరైన రూ.4,16,83,000 చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాసంకల్ప యాత్రలో పొదుపు మహిళల కష్టాలు నేరుగా తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా రుణం మాఫీ చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చి ప్రలోభపెట్టిందేకాని అమలు చేయడంలో విఫలమై మహిళలను మోసం చేసిందన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కో ఇంటికి రూ. 2లక్షల నుంచి రూ.3లక్షల వరకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని వివరించారు. ఎంపీడీఓ బంగారమ్మ, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, ఎంపీపీ కేశన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు బీఆర్ బసిరెడ్డి, సోగనూరు భీమిరెడ్డి ప్రసంగించగా జేసీఎస్ పట్టణ కన్వీనర్ బంగి శ్రీరాం, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

**రామాలయంలో పూజలు**

పట్టణంలోని 17వ వార్డు మైనారిటీ కాలనీ రహదారిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో మంగళవారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఫలప్రసాదాలను అందించి ఆశీర్వదించారు. నాయకులు కనకవీడు లక్ష్మీకాంతరెడ్డి, చెన్నారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, రామాంజినేయరెడ్డి తదితరులు ఉన్నారు.

### పట్టుబడిన వాహనాల వేలం

ఆలూరు రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఆలూరు సెబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం వేలం వేశారు. మొత్తం 14 వాహనాలకు ఎంవీఐ అధికారులు నిర్ణయించిన ధర రూ.1,63,000 కాగా వేలంలో బిడ్ అమౌంట్ రూ.3,09,000 వచ్చిందన్నారు. 18 శాతం జీఎస్టీ కలుపుకుని మొత్తం రూ.3,64,620 నగదును ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని సెబ్ సూపరింటెండెంట్ శ్రీధర్ రావు చెప్పారు. సెబ్ సీఐ ఎర్ర వెంకట్, ఎస్ఐ రాజశేఖర్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

### 1 నుంచి గిరకబండి పోటీలు

ఎమ్మిగనూరురూరల్: దైవందిన్నె గ్రామంలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని జగనన్న యూత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి జిల్లాస్థాయి ఎద్దుల గిరక బండి పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు. వారు మంగళవారం మాట్లాడుతూ గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ.20,016, రెండో బహుమతి రూ.10,016, మూడవ బహుమతి రూ.5,016 అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వృషభాల యజమానులు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈ నెల 31వ తేదీలోపు పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 80968 04327, 80746 11014 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

### స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

హొళగుంద: హొళగుంద జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న సందేష్, అనుష్క, గౌతమ్‌రాజు, అక్షిత, పూజ, ప్రవల్లిక ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు హెచ్ఎం మల్లికార్జునగౌడ్ మంగళవారం తెలిపారు.

## సంక్షిప్తం

**రంజాన్ ప్రశాంతంగా జరుపుకోవాలి**

నందవరం: రంజాన్ పండుగను మండలంలోని ముస్లింలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ల్లో ముస్లిం పెద్దలు, గ్రామ పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రంజాన్ మాసం ఉపవాస దీక్షలు జరుగుతున్నందున ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ మహేష్ కుమార్, తదితరులు ఉన్నారు.

**నాడు– నేడు పనులు పూర్తి చేయండి**

నందవరం: మన బడి నాడు–నేడు రెండవ విడత అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎంఆర్సీ భవనంలో మండలంలోని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో 41 ప్రభుత్వ బడుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.2.16 కోట్లు విడుదల చేసిందన్నారు. ఆయా పాఠశాలల్లో పనులు నాణ్యతతో చేపట్టాలని, త్వరగా పూర్తి చేసేలా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎంలు అరుణ, రమేష్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కబడ్డీ పోటీలు ప్రారంభం**

కృష్ణగిరి: మండల పరిధిలోని సంగాల గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు గిడ్డయ్య, రామచంద్రుడు, చిన్న మద్ది, చిన్నరాముడు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు స్ఫూర్తి చాటాలని, ఇలాంటి టోర్నీల్లో ప్రతిభ కనపరిచి ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. పోటీల్లో 20 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందజేయనున్నట్లు వెల్లడించారు.

**బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు**

పత్తికొండ రూరల్: గద్దెరాళ్లలో జరిగే దేవరకు వెళ్లి మంగళవారం తిరిగి వస్తుండగా దూదేకొండ సమీపంలో బైక్ అదుపుతప్పి పత్తికొండ వార్డు సభ్యుడు రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు కుటుంబసభ్యులు కర్నూలుకు తీసుకెళ్లారు.

**అక్రమ మద్యం స్వాధీనం**

ఆలూరు రూరల్: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని 21 బాక్సుల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు సెబ్ సీఐ ఎర్ర వెంకట్ తెలిపారు. ఆస్పరి మండలం తురువగల్లు సమీపంలో మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా తురువగల్లుకు చెందిన నరసన్న బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. అతని నుంచి 21 బాక్సుల మద్యం స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాడులలో ఎమ్మిగనూరు మొబైల్ పార్టీ సీఐ దశరథ రామిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

**తపాలా బీమాతో ప్రయోజనం**

హొళగుంద: తపాలా జీవిత బీమా పథకం గ్రామీణ ప్రజలకు వరంలాంటిదని కర్నూలు పోస్టల్ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ అన్నారు. మంగళవారం ఆయన హొళగుందలోని సబ్ పోస్టాఫీసును ఆకస్మిక తనిఖీ చేశారు. పోస్టాఫీసు కార్యకలాపాలు, రికార్డులు, ఉద్యోగుల రోజువారి విధులను పరిశీలించి ఖాతాదారులతో మాట్లాడి అభిప్రాయాలను సేకరించారు. తక్కువ పెట్టుబడితో బీమా చేయించడం వల్ల భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.